ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 17 | మార్చి | 2024
పేజీలు 8

## తెలంగాణ నుంచి పోటీ తప్పదు



-మరోమారు పాపాలు చేసేందుకు సిద్ధమైన బిజెపి
-కాంగ్రెస్ ఒంటెద్దు పోకడ దేశానికే నష్టం
-వందరోజుల కాంగ్రెస్ పాలన సంతృప్తికరం
-మీడియా సమావేశంలో కూనంనేని

మెయిన్‌లో..

# పోరాటాలు, త్యాగాలతోనే హక్కుల సాధన




- ద్రోహం చేస్తున్న నిబద్ధత లేని కార్మిక సంఘాలు
- కార్మికులను విస్మరిస్తే కాంగ్రెస్‌కే నష్టం
- ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభల ప్రారంభ సభలో కూనంనేని
- పతాకాన్ని ఆవిష్కరించిన పద్మాకర్
- అమర వీరుల స్థూపాన్ని ప్రారంభించిన తిమ్మినేని

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పోరాటాలు, త్యాగాలతోనే కార్మికులకు హక్కులు సాధించబడ్డాయని అదే కోవలో హక్కులు, సంక్షేమ పథకాల కోసం పోరాడక తప్పదని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. 100 ఏళ్ల చరిత్ర ఏఐటియుసి సొంతమని కార్మిక పక్షాన కడ వరకు నిలిచిన ఘన చరిత్ర తమ సంఘానిదని ఆయన తెలిపారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలు స్థానిక బివి రామారావు ప్రాంగణం (టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్)లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభ సూచికగా ఎంప్లాయిస్ యూనియన్ పతాకాన్ని సీనియర్ నాయకులు పద్మాకర్ ఆవిష్కరించగా అమరుల స్థూపాన్ని తిమ్మినేని రామారావు ఆవిష్కరించారు. అనంతరం ఎస్. బాబు అధ్యక్షతన ప్రారంభమైన మహాసభలో సాంబశివరావు మాట్లాడుతూ 1956లో ఆర్టీసీలో ఉద్భవించిన మొట్టమొదటి సంఘం ఎంప్లాయిస్ యూనియన్ ఆర్టీసీ కార్మికులకు అనేక హక్కులను సాధించి పెట్టిందన్నారు. సంఘాన్ని చీల్చేందుకు అనేక మార్లు ప్రయత్నం జరిగినా ద్రోహులకు బుద్ధి చెబుతూ కార్మికులు ఏఐటియుసి అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ పక్కనే నిలిచారని ఆయన గుర్తు చేశారు. గుర్తింపు సంఘంగా అనేక

మిగతా 2లో..




## రామాలయాభివృద్ధికి సిద్ధమవుతున్న ప్రణాళికలు



2లో

- దేవస్థానం, రెవెన్యూ, జిపి అధికారుల ప్రాథమిక సర్వే
- ఇప్పటికే సాధ్యా అసాధ్యాలపై సమాలోచన
- ముగింట మూడు ప్రణాళికలు
- మంగళవారం నాటికి నివేదికలు సిద్ధం

## పాలేరు సమగ్రాభివృద్ధికి కృషి



2లో

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



# పోరాటాలు, త్యాగాలతోనే హక్కుల సాధన







**(మొదటిపేజీ తరువాయి)**

మార్లు ఎంప్లాయీస్ యూనియన్ గెలుపొందిందని సింగరేణి సహా పలు సంస్థల్లో ఏఐటియుసి అనుబంధ సంఘాలు గుర్తింపు సంఘంగా తమ సత్తాను చాటుతున్నాయని ఆయన తెలిపారు. కానీ కొంత మంది నాయకులు పదవుల కోసం కార్మికుల త్యాగాలను ఫణంగా పెట్టి విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలుపుతున్నారని అంతిమంగా ఎర్ర జెండానే కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. నిబద్ధత లేని కార్మిక సంఘాలతో ఎప్పుడైనా ప్రమాదమేనన్నారు. సింగరేణిని ఉదాహరణగా తీసుకుంటే కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఐఎన్‌టియుసి, బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు టిబిజికెఎస్ సంఘంగా ఉంటున్నారని ప్రతిసారి వారిని ఏఐటియుసినే ఢీ కొంటుందన్నారు. ఆర్టీసీలో సైతం ఎంప్లాయీస్ యూనియన్‌ను విచ్ఛిన్నం చేసి పబ్బం గడుపుకోవాలని కొందరు ప్రయత్నించారని వారు శాశ్వతంగా చరిత్ర హీనులుగా మిగిలిపోక తప్పదన్నారు. బిఆర్ఎస్, బిజెపి రెండు కార్మిక వ్యతిరేక పార్టీలేనని కాంగ్రెస్ కూడా తన వైఖరిని మార్చుకుంటే మంచిదన్నారు. బిజెపి కార్మికులను బానిసల్లా చూస్తుందని బిజెపి పాలనలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షాన ఆలోచన చేయాలని మూడు నెలల్లో 22 కోట్ల మంది మహిళలను గమ్యాలకు చేర్చిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఫిట్‌మెంట్ పెంచాలని, పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులుగా ఇదే చివరి మహాసభ కావచ్చునని భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండే అవకాశం ఉందని ఎక్కడ ఉన్నా వామపక్ష భావాజాలాన్ని నిలుపుకుని ముందుకు సాగాలన్నారు. మనకెందుకులే అన్న ధోరణిని వదిలేసి అందరం ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. త్వరలోనే ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలుద్దామని కూనంనేని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ కూడా కార్మిక సంఘాలతో జరిగిన సమావేశాలకు ఎంప్లాయీస్ యూనియన్‌ను ఆహ్వానించక పోవడం శోచనీయమన్నారు. బిజెపి రాముడి పేరుతోనో లేదా విపక్షాలను భయభ్రాంతులకు గురి చేయడం ద్వారా గెలుపొందాలని చూస్తుందని దీనిపై కార్మికులు ఆలోచన చేయాల్సి ఉందన్నారు. బిఆర్ఎస్ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిందని అధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీ అడ్రస్ గల్లంతవుతుందని కూనంనేని తెలిపారు. కవిత అరెస్టు రాజకీయ ఎత్తుగడగా ఆయన అభివర్ణించారు. తెలంగాణలో లబ్ది పొందెందుకు బిజెపి, బిఆర్ఎస్ ఒకటి కాదని చెప్పేందుకు కవితను అరెస్టు చేశారు తప్ప దీనిపై చిత్తశుద్ధి లేదన్నారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ. వెంకన్న, సిపిఐ ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, ఎస్‌కె సాబీర్ పాషా, ఎంప్లాయీస్ యూనియన్ సీనియర్ నాయకులు పద్మాకర్, గౌరవాధ్యక్షులు వెంకట్ గౌడ్, ఏఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహాన్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు దామోదర్, నర్సయ్య, కె. భాస్కర్‌రావు, తిమ్మినేని రామారావు, పాటి అప్పారావు, పిల్లి రమేష్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని డిపోలకు ప్రాతినిథ్యం వహిస్తూ 250 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరయ్యారు.

## రామాలయాభివృద్ధికి సిద్ధమవుతున్న ప్రణాళికలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచల రామాలయాభివృద్ధి ప్రణాళికలు ఎట్టకేలకు కార్యరూపం దాలుస్తున్నాయి. 2016 నుండి అదిగో అభివృద్ధి.. ఇవిగో నిధులు అంటూ జరిగిన సాగతీతకు కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో తెరపడింది. ఈ నెల 11 ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి భద్రాచలం వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రామలాయాభివృద్ధిపై ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం సాక్షిగా పలు అంశాలు చర్చకొచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా యుద్ధ ప్రాతిపదికన నివేదికలు తయారు చేయాలంటూ జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆలా గురువారం ఆదేశించడంతో అభివృద్ధి ఆశలు మొలకెత్తాయి. అభివృద్ధి కోసం రూ.150 నుండి రూ.180 కోట్ల వరకు వెచ్చించే అవకాశం ఉదనేది విశ్వసనీయ సమాచారం. ఈ నిధులతో ఏ రకమైన అభివృద్ధి చేయాలని, అందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఓ అధికారులు ఓ అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం దేవస్థానం అధికారులతో పాటు రెవెన్యూ, గ్రామపంచాయితీ అధికారులు రామాలయ పరిసర ప్రాంతాల్లో ప్రాథమిక సర్వే చేశారు.

**సమాలోచన ...**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ కుమార్ రెడ్డి రామాలయ మాడ వీధుల కోసం రూ.12 కోట్ల నిధులు మంజూరు చేశారు. మాడ వీధుల నిర్మాణం కోసం కావాల్సిన భూ సేకరణకు వేగవంగా చేశారు. అయితే అప్పట్లో ఇద్దరు మాత్రం తమకు ఆ పరిహారం సరిపోదని, పెంచి ఇవ్వాలని, రామాలయంలో ఉద్యోగం సైతం కల్పించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు ముందుకు సాగలేదు. కాగా గురువారం ఈ అంశంపై అధికారుల మధ్య తీవ్ర చర్చ సాగినట్లు తెలుస్తోంది. గతంలో భూమి ఇచ్చిన వారు, కోర్టుని ఆశ్రయించినవారిని సైతం పిలిపించి సాధ్యాఅసాధ్యాలపై చర్చించినట్లు తెలుస్తోంది.

**ముంగిట మూడు ప్రణాళికలు...**

గతంలో ఆర్కిటెక్ట్ ఆనందసాయి ఇచ్చిన మ్యాప్‌ను సిఎంతో సహా వైదిక కమిటీ కూడా ఆమోదించింది. దాని నమూనానే తీసుకుని ఈ ప్రభుత్వం కూడా ముందుకు సాగే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. రాజవీధి మొత్తాన్ని తీసుకుని తాతగుడి సెంటర్ వరకు ఉన్న సుమారు 80 ఇళ్లను తొలగించి అభివృద్ధి చేస్తారనే వాదన ఉంది, మరో ప్రక్క పాత లెక్కల ప్రకారం కో ఆపరేటివ్ బ్యాంక్ నుండి సూపర్ బజార్ మీదుగా శిల్పినగర్‌ను కలుపుకుని గోదావరి కరకట్ట వరకు భూ సేకరణ చేసి యాదాద్రికి ధీటుగా అభివృద్ధి చేస్తారనే వాదన సాగుతోంది. మరో ప్రక్క రామాలయం ముందు నుండి గోదావరి వరకు ఉన్న ఇళ్లను తొలగించి రామాలయం నుండి నర్సింహస్వామి ఆలయం వరుక ఓ వంతెనను నిర్మించి భక్తులు అటుగా గోదావరి స్నానాలకు వెళ్లివచ్చేలా చర్యలు తీసుకుంటారని, ఆ క్రింది భాగమంతా విశాలంగా ఉంచి వాహనాలు నిలుపుకునేందుకు లేదా రామాలయం ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటారని,ఇందులో భాగంగా విస్తా కాంప్లెక్స్, రామాలయం ముందుభాగంలోని అన్ని వ్యాపార దుకాణాలు తొలగించి అభివృద్ధి చేస్తారని అంటున్నారు. ప్రధానంగా భూ సేకరణ పెద్ద అడ్డంకిగా మారనుంది. ఇక్కడ తొలగించిన ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించి తిరిగి భూమి ఇచ్చేందుకు భద్రాచలంలో ఎక్కడా జానా జాగ కూడా లేదు. దీంతో ఇదో పెద్ద సమస్యగా మారనుంది. గత కోర్టు చిక్కులను దృష్టిలో పెట్టుకుని భక్తుల, పరిసర ప్రాంత ప్రజలు మనోభావాలు దెబ్బతినకుండా రామాలయాభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ ఉద్యేశ్యంతో ఇంత సున్నితమైన చిక్కుముడిని పరిష్కరించి ముందుకు పోయేందుకు అధికారులు ఏ అస్త్రాన్ని ప్రయోగిస్తారో చూడాల్సి ఉంది.

**మంగళవారం నాటికి నివేదికలు సిద్ధం...**

సుమారు రూ.150 నుండి రూ.180 కోట్ల అభివృద్ధి పనుల అంచనాలకు సంబంధించి మంగళవారం నాటికి నివేదికలు సిద్ధం కానున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే మూడు శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. కలెక్టర్ ఆదేశాను సారం పలు రకాల నివేదికలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

## పాలేరు సమగ్రాభివృద్ధికి కృషి





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పాలేరు నియోజక వర్గ సమగ్రాభివృద్ధికి తగు చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజక వర్గంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కూసుమంచి మండల కేంద్రంలో రూ. 28.80 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు, జీళ్లచెరువు గ్రామంలో రూ. 57.80 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు, నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలో రూ. 20 కోట్ల వ్యయంతో ఆర్అండ్‌బి రహదారి విస్తరణ పనులకు, చెరువు మాధారం గ్రామంలో రూ. 20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు, ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని కైకొండాయిగూడెంలో కోటి రూపాయల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ వేసవిలోగా శంకుస్థాపన చేసిన పనులు పూర్తి చేయాలని తెలిపారు. అభయ హస్తం ద్వారా ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలో ఐదు గ్యారెంటీలు అమలు చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ వల్ల ఆరవ గ్యారెంటీ అమలు కాలేదని కోడ్ తర్వాత ఆ హామీని కూడా అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేసినట్లు మంత్రి తెలిపారు. మహాలక్ష్మి పథకంలో 29 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసినట్లు మంత్రి తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. రూ. 500లకే సిలెండర్ అందిస్తున్నట్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను మొదటి విడతగా స్థలం ఉన్న వారికి రూ. 5 లక్షల చొప్పున అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. రెండవ విడతలో స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రభుత్వం ఏర్పడిన 75 రోజుల్లోనే 31వేల ఉద్యోగ నియమాకాలు చేపట్టినట్లు తెలిపారు. టిఎస్‌పిఎస్‌సిని ప్రక్షాళన చేసి గ్రూప్ 1 నుండి గ్రూప్ 4 వరకు వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మెగా డియస్సి ప్రకటించి 11,062 ఉద్యోగ నియమాకాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో మట్టి రోడ్లు లేకుండా సిసి రోడ్ల నిర్మాణం తో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్యాంప్రసాద్, పిఆర్ ఎస్ఈ చంద్రమౌళి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె. శ్రీరాం, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, వాణిశ్రీ, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేయాలి




**-మౌలిక వసతుల కల్పనకు చర్యలు**
**-జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసి కనీస మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపిడివోలు, ఎంపివోలు, ఏపిఎంలతో మహిళా శక్తి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయాలని కమిటీకి మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, హెచ్‌ఎం మెంబరు కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. గ్రామంలో రెండు, మూడు సంఘాలు ఉంటే పాఠశాలకు సమీపంలోని సంఘానికి తొలుత అవకాశం ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత రెండేళ్లకు కొనసాగే కమిటీలో విద్యార్థుల తల్లులను సభ్యులుగా ఎంపిక చేయాలన్నారు. కమిటీ పేరిట బ్యాంక్ ఖాతా తెరవాలని ఆయన సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన వసతులు ఏమి కావాలో నివేదికను రూపొందించుకుని వాటిని సమకూర్చుకోవాలన్నారు. తరగతి గదిలో సరిపోను వెలుతురు ఉండేలా ఎల్‌ఈడి లైట్లు, మంచి గాలి వచ్చేవిధంగా కంపెనీ ఫ్యాన్లు అమర్చాలన్నారు. వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు మళ్లీ తిరిగి స్కూల్‌కు వచ్చే సమయానికి మొత్తం మార్పు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యతను సైతం స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా యూనిఫాం కుట్టే సామర్థ్యం కలిగిన మహిళా సంఘాలను గుర్తించి ఆర్డర్ ఇవ్వాలని సూచించారు. తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావడం, బాలికల కోసం అదనపు మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ వసతుల కల్పన బాధ్యతలను జూన్ 10 లోగా అమ్మ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా పరిషత్ సిఈవో వినోద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలి





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల ప్రవర్తన నియమావళిన ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో శనివారం నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినట్లు ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడ రాతలు తొలగిస్తున్నట్లు ఆయన తెలిపారు. విగ్రహాలకు ఎన్నికల నియమావళి అమలులో ఉన్నంత వరకు వస్త్రాలతో కప్పి ఉంచాలన్నారు. కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులపై రాజకీయ పక్షాల ఫోటోలు ఉన్న వాటిని తొలగించడం, ప్రభుత్వ వెబ్ సైట్లలో, క్యాలెండర్‌లలో రాజకీయ పక్షాల ఫోటోలను తొలగించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నేపథ్యంలో పలు గ్రామాలలో, పలు ప్రాంతాలలో ఫ్లెక్సీలు , బ్యానర్ల తొలగింపుతో పాటు విగ్రహాలకు ముసుగులు తొడిగారు.

# ఎమ్మెల్సీ కవిత అరెస్టును ఖండిస్తూ నిరసన




**ప్రజాపక్షం/ మధిర :** లిక్కర్ స్కామ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవితను ఈడి అధికారులు అక్రమ అరెస్టు చేయటాన్ని ఖండిస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మధిర పట్టణంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలోని ప్రధాన సెంటర్‌ల్లో నిరసన ర్యాలీ చేపట్టి తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు చేరుకుని తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కొలేకనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు బనాయించి అక్రమ అరెస్టుకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎలాంటి చర్యలకు భయపడకుండా ఉద్యమపార్టీ అయిన కేసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ఎదుర్కొని ముందుకుసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు పల్లపోతుల వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ బిక్కి ప్రసాద్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జెఎన్‌టియు ఫలితాలలో ఎస్‌బిఐటి ప్రభంజనం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జెఎన్‌టియు ఇటీవల విడుదల చేసిన మొదటి సంవత్సరం ఫలితాలలో స్థానిక ఎస్‌బిఐటి కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో తమ విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించడం తమకు గర్వకారణమన్నారు. ఖమ్మంజిల్లాలోనే తమ విద్యార్థులు 9.50 ఎస్‌జిపిఏతో అగ్రగామిగా నిలిచారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి తెలిపారు. సిఎస్ఈతో పాటు ఈసిఈ, సిఎస్‌ఎం, సిఎస్‌డి వంటి పలు విభాగాలలో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన వారిలో సిఎస్‌ఎం నుండి ఎం. హరిణి 9.50, సిహెచ్ కళ్యాణి 9.35, పి. స్వాతి, టి. నాగత్రిశూలాచారి 9.05 లతో ముందుండగా సిఎస్ఈ నుండి ఆర్. సౌజన్య 9.25, ఎ. యామిని, జి. లోహితారెడ్డి, కె. భార్గవి, సత్యశ్రీ , ఎస్‌కె అర్షద్ 9.05 లు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జి. రాజ్‌కుమార్ తెలిపారు. ఇవే కాకుండా ఈసిఈ నుంచి ఎస్‌కె షాహనాజ్ 9.0 తో పాటుగా ఇంకా ఎందరో విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబర్చారని వారు తెలిపారు. ఈ సందర్భంగా విభాగాధిపతి టి. గంగాధర్ అధ్యాపకులను, విద్యార్థులను వారు అభినందించారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా తాము జిల్లాలో అగ్రగామిగా నిలిచామని ఇది తమపై మరింత బాధ్యతను పెంచిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె. అమిత్‌బిందాజ్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జి. ప్రవీణ్‌కుమార్, జే. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, హెచ్‌వోడిలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహపరిచిన ప్రాచీన క్రీడలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అలనాటి కాలంలో ఆడిన ఆటలు బుద్ధి వికాసానికి, చతురతకు, శారీరక దృఢత్వానికి ఎంతగానో దోహదపడేవని పాఠశాల ప్రిన్సిపాల్ ఎండి అబాద్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన ఆటలలో శాస్త్రీయ ధృక్పథం , బుద్ధిబలం, శరీర దృఢత్వం కనిపిస్తాయన్నారు. అంతరించిపోతున్న ప్రాచీన క్రీడల పట్ల పాఠ్య పుస్తకాలకు అనుకూలంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించుటకు న్యూ విజన్ పాఠశాలలో శనివారం ప్రాచీన క్రీడల మహోత్సవాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ క్రీడల్లో దాడి, అష్టాచమ్మా, తొక్కుడు బిళ్ల, వాన గుంటలు, అచ్చన గిల్లలు, ఉయ్యాల ఊగటం, బొంగరాలు, గోలీలాట వంటి సంప్రదాయ క్రీడలను విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఆడారని తెలిపారు. తెలుగు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాల నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆర్యవైశ్య కల్యాణ మండపం అధ్యక్షులు కురువెళ్ల కృష్ణ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముల జీవిత చరిత్రను వివరించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండపం ప్రధాన కార్యదర్శి నాళ్ళ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పబ్బతి జగదీష్, కుంచం కృష్ణారావు, పల్లపోతు ప్రసాదరావు, పబ్బతి మల్లికార్జున్‌రావు, నర్సింహారావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# యుఎస్‌ఎలో పిజి సీటు సాధించిన లక్కిరెడ్డి సంధ్య



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని శ్రీ సంధ్య మోటార్స్ అధినేత లక్కిరెడ్డి సుధాకర్‌రెడ్డి కుమార్తె డాక్టర్ లక్కిరెడ్డి సంధ్య యుఎస్‌ఎలోని సౌత్ జార్జియా మెడికల్ సెంటర్ నందు ఇంటర్నల్ మెడిసిన్(ఐఎం) పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీటు సాధించారు. 2022లో కాటూరి మెడికల్ కాలేజి నుండి ఎంబిబిఎస్ డిస్టింక్షన్ సాధించింది. అతర్వాత సంధ్య యుఎస్‌ఎంఎల్‌ఇ ద్వారా ఇంటర్నల్ మెడిసిన్ పిజిలో సీటు సాధించడం పట్ల ప్రముఖ కార్డియాలజిస్ట్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి, భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, విద్యాలత, కటికల కృష్ణారెడ్డి, బూసా కోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

# జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 1045 కేసులు పరిష్కారం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర కోర్టు నందు శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 1045 కేసులు పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ జడ్జి టి.కార్తీక్‌రెడ్డి తెలిపారు. రెండు లోక్‌అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేసి కేసులు పరిష్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 81 క్రిమినల్ కేసులు పరిష్కారం కాగా రూ.1,44,100 జరిమానా విధించారు. రెండు సివిల్ కేసులు రాజీ అయ్యాయి. అదేవిధంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 129 క్రిమినల్ కేసులు పరిష్కారం కాగా రూ.1,20,000 జరిమానా విధించారు. ఆరు సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎం.అబ్రహం నేతృత్వంలో జరిగిన లోక్‌అదాలత్ బెంచ్‌లో 527 కేసులు పరిష్కారంకాగా రూ.55350 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఎపిపిలు నాగలక్ష్మి, భద్రయ్య, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయటం పట్ల ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అడిగిన వెంటనే ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు చేయటంపై హర్షం వ్యక్తం చేస్తూ సిఎం, డిప్యూటీ సిఎంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్పొరేషన్ ఏర్పాటుతో ఆర్యవైశ్యుల కులానికి చెందిన వెనుకబడిన వారికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హన్మంతరావు, ఆర్యవైశ్యులు రంగా అప్పారావు, మిరియాల రమణగుప్తా, కౌన్సిలర్ కోన ధనికుమార్, నాళ్ల శ్రీనివాసరావు, రంగా శ్రీనివాస్, వేముల తిరుపతిరావు, పల్లపోతుల ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోడీ దిష్టిబొమ్మ దహనం



ప్రజాపక్షం/ బోనకల్ : మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ కూతురు ఎమ్మెల్సీ కవితను ఈడి అధికారులు అక్రమ అరెస్టును ఖండిస్తూ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ప్రధాని మోడీ బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటిసి బాణోతు కొండ, పార్టీ మండల కార్యదర్శి మోదుగు నాగేశ్వరరావు మాట్లాడుతూ కావాలనే పార్లమెంట్ ఎన్నికల వేళ బిజెపి పార్టీ బిఆర్ఎస్ పార్టీని దెబ్బతియాలనే కక్షపూరిత రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. ఇలాంటి అక్రమ అరెస్టులతో బిఆర్ఎస్ పార్టీని దెబ్బతీయాలని చూస్తూ రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చల్లి ప్రసాద్, తేలూరి రమేష్, మోర్ల నర్సింహారావు, నోముల వెంకటేశ్వరరావు, దూప కృష్ణ, పండగ సీతారాములు, గొంగూర రమేష్ పాల్గొన్నారు.

## విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాది విద్య



ప్రజాపక్షం/ చింతకాని : విద్యార్థుల బంగారు భవితకు పునాది విద్య, క్రమశిక్షణ, సమయపాలన అని పందిళ్ళపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం పరిశ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం పాఠశాల పదవతరగతి విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, చైర్మన్ పరిశ పుల్లయ్య అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు పదవతరగతిలో మంచి ఫలితాలు సాధించాలని, తల్లిదండ్రులకు గర్వించదగ్గ పిల్లలుగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, వినయం విలువలు కలిగి ఉండాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుశీల, కవిత, శ్రీనివాసరావు, శివనారాయణ, సరిత, సుజాత, మహేశ్వర్, షర్మిలకుమారి, జ్యోతి, నాగమణి, హరిత, కవిత, నాగేంద్రమ్మ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముత్తగూడెంలో హెల్త్‌సబ్‌సెంటర్‌కు శంకుస్థాపన



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : మండలంలోని ముత్తగూడెం గ్రామంలోని జెకె టౌన్‌షిప్‌లోని గ్రీన్‌బెల్ట్‌లో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు రూ.20 లక్షలతో శనివారం ఉదయం 11గంటలకు శంకుస్థానపన చేశారు. దీనికి గ్రామ ఎంపిటీసీ మొహమ్మద్ జాస్మిన్ ముఖ్య అతిథిగా హాజరయ్యి ముగ్గు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రజలకు పదికాలల పాటు ఉపయోగపడేదిని కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్ వెంకయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రెసిడెంట్ మహ్మద్ గౌస్‌పాషా, సిపిఐగ్రామశాఖ అధ్యక్షులు బూర నాగేశ్వరరావు, మండల కార్యవర్గ సభ్యుడు దొంతగాని రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పొంగులేటి యువసేన ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ



ప్రజాపక్షం/మణుగూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షకు సిద్ధం అయిన 134 మంది విద్యార్థులకు మణుగూరు పొంగులేటి యువసేన అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సీఐ సతీష్ కుమార్ చేతుల మీదుగా పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, అలాంటి దశలో తల్లిదండ్రుల మాటలు వింటూ ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఆటలకు, పరీక్షలకు గెలుపు, ఓటములు ఫెయిల్, పాస్ అనేవి సహజమని అవి ప్రామాణికంగా తీసుకుని ఆ ఫలితాలు పునరావృతం కాకుండా చూసుకోవాలి తప్ప భావోద్వేగాలకు లోనై అఘాయిత్యాలకు పాల్పడటం, ఇంటి నుంచి వెళ్లిపోవడం వంటివి చేయరాదన్నారు. జీవితంలో అన్నీ ఆనందాలు సమయానికి అవే వస్తాయని తెలిపిన ఆయన వాటి కోసం ఉన్నతంగా ఎదగాలంటే చదువుతో పాటు గెలుపోటములను సమానంగా తీసుకు నే పద్ధతిని అలవరచుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, శివ, సీనియర్ నాయకులు సామా శ్రీనివాస రెడ్డి, గణేష్ రెడ్డి, పెనుగొండ సాంబ శివరావు, యువసేన ప్రతినిధులు కరణ్ కర్, కిరణ్, తిప్ప శ్రీను, అఖిల్, అనిల్ రెడ్డి, ప్రీతమ్, వహీద్, రామయ్య, రామ్ సాయి, రవి కుమార్ తదితరులు ఉన్నారు.

# గూడు దక్కేదెవరికో..?



-ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం
-సొంతింటి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

ప్రజాపక్షం/పినపాక: మండల వ్యాప్తంగా కొన్ని ఏండ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల ఆశలు ఫలించే సమయం వచ్చింది. పేదోడికి గూడు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభమైంది. ఈ నెల11 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన సభల్లో ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులు దరఖాస్తులు అందించారు. కానీ ప్రభుత్వం తొలి విడతలో నియోజకవర్గానికి 3500 చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించడంతో లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది. ఇందుకు లబ్ధిదారులు ఎంపిక అధికారులకు సవాల్ గా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే వీటిని దక్కించుకునేందుకు పైరవీలు ప్రారంభమయ్యాయి. అధికార పార్టీ నాయకుల ద్వారా ఇంటిని మంజూరు చేయించుకునేందుకు వారి చుట్టూ ప్రదక్షిణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. సొంత ఇంటి కల కోసం పినపాక మండల వ్యాప్తంగా వేలాది మంది నిరుపేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించిన ఇండ్లే ఇప్పటికీ పేదలకు దిక్కయ్యాయి. గత పదేండ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ లు కేటాయించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ ఇండ్లను మాత్రం ఇప్పటి వరకు కేటాయించలేదు. కొన్ని చోట్ల టిఆర్ఎస్ కట్టించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు చెట్ల పొదల్లో దర్శనమిస్తున్నాయి. తాజాగా కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో ఇండ్ల మంజూరుపై జనాల్లో ఆశలు రెకెత్తిస్తున్నాయి. అధికారంలోకి వస్తే రూ. 5 లక్షలతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని ఆరు గ్యారెంటీల్లో పొందుపరిచిన ప్రభుత్వం ఈ హామీని అమలు చేసే దిశగా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఆర్టీసీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలకు పెంపుతో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500/లకే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తోంది. తాజాగా నిరుపేదలకు అత్యంత కీలకమైన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సైతం ప్రారంభించనుండటంతో వేలాది మంది నిరుపేదలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఇందిరమ్మ ఇండ్లను దక్కించుకునేందుకు అనేకమంది ప్రయత్నాలు ప్రారంభించారు. వారికి తెలిసిన పార్టీ నాయకుల ద్వారా తమకు ఇండ్లు కేటాయించే విధంగా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఎంపికపై ఆందోళన వ్యక్తమవుతోంది. తొలి విడతలో ఇండ్లు లేని అర్హులైన పేదలను గుర్తించి తీసుకోవాలని కోరుతున్నారు.

## ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ ముమ్మాటికీ రాజకీయ కుట్రే..



ప్రజాపక్షం/పినపాక: బిఆర్ఎస్ నేత, శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అరెస్ట్ కక్ష సాధింపు చర్య అని పినపాక ఎంపీపీ గుమ్మడి గాంధీ అన్నారు. శనివారం పినపాక మాజీ శాసనసభ్యులు, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపుమేరకు పినపాక మండలం ఈ. బయ్యారం క్రాస్ రోడ్ లో బిఆర్ఎస్ నాయకులు నిరసన తెలియజేశారు. బీఆర్ఎస్ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ.బయ్యారం క్రాస్ రోడ్ రహదారి పైన బైఠాయించారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్టు చేయడం ముమ్మాటికీ రాజకీయ కుట్రలో భాగమేనని ఆత్మ కమిటీ చైర్మన్ భద్రయ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్ రవి శేఖర్ వర్మ ఆరోపించారు. సుప్రీం కోర్టులో కేసు విచారణలో ఉండగా ఒక మహిళ హక్కులను కాలరాసి రాత్రి పూట అరెస్టు చేయడం కేంద్రంలోని బీజేపీ చేసే రాజకీయాలకు పరాకాష్ట అని బిఆర్ఎస్ జిల్లా నాయకులు భవాని శంకర్ మండిపడ్డారు. నేడు చీకటి రోజు అని కడిగిన ముత్యంలా ఎమ్మెల్సీ కవిత బయటకు వస్తారని, ప్రజాస్వామ్యం గెలుస్తుందని రైతు సమన్వయ సంఘం అధ్యక్షులు దొడ్డ శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కొండేరు రాము, సుధాకర్ రెడ్డి, పోలిశెట్టి సత్తిబాబు, కిషోర్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

## తనికెళ్ల గ్రామ అభివృద్ధి ప్రదాత యాసా అనంతరామయ్య



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిదిలోని తనికెళ్లలో సిపిఎం సీనియర్ నాయకులు యాసా అనంరామయ్య 7వ వర్థంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సిపిఎం సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య స్థూపానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొప్పుల కృష్ణయ్య మాట్లాడుతు అనంతరామయ్య సిపిఐ పార్టీని విభేదించి బయటకు వచ్చినప్పుడు ఆయనను బూర్జువాపార్టీల వారుతమ పార్టీలోకి రావాలని ఆహ్వానించాయని కాని కమ్యూనిస్టు భావాలు కలిగిన అనంతరామయ్య మరో ఎర్రజెండా పార్టీ అయిన సిపిఎం పార్టీలో నే చేరి కడవరకు కొనసాగి ఆయన నమ్మిన సిద్ధాంతాలకోసం పనిచేశాడని కొనియాడారు. తనికెళ్ల గ్రామంలో ఎస్సీ కాలనీ , ఎస్టీ కాలనీ , వడ్డెర కాలనీ , రెండు బిసి కాలనీలు సుమారు 100 ఎకరాల వరకు ఇండ్ల స్థలాలు పంచిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. పార్టీ అధికారంలో లేకున్నా స్వంత డబ్బుతో కాలనీలను ఏర్పాటు చేసి వందల మందికి ప్లాట్లు పంచిపెట్టిన మహనీయుడని అన్నారు. గ్రామంలోని ఎస్టీలకు ఒక్కొక్కరికి 20 గుంటల చొప్పున భూములు పంచిపెట్టిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. పట్వారీగా విధులు నిర్వహిస్తూనే తాను నమ్మిన సిద్ధాంతం కోసం భూమికలిగిన పేదలకు పట్టాదారుల పాసుపుస్తకాలు ఇచ్చారని తెలిపారు. తుదిశ్వాస వరకు ఎలాంటి అవినీతి మరకలేకుండా నిస్వార్థంగా పేదప్రజల పక్షాన పోరాడిన చరిత్ర ఆయన సొంతం అని అన్నారు. ఏనాడు కుటుంబం స్వలాభాలకోసం ఆశించకుండా నిత్యం పేద ప్రజల సమస్యల పరిష్కారంకోసం కృషిచేసిన కృషీవలుడని అన్నారు. అన్నారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం , సిపిఎం మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు , చల్లా నారాయణ , చింతనిప్పు సూర్యం , ప్రముఖ న్యాయవాది అన్నారపు వెంకటేశ్వర్లు , యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్ , సిపిఐ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు , సిపిఐ జిల్లా నాయకులు పివిరావు , పాపిట్ల ఏసు , అనంతరామయ్య కుమారుడు యాసా తిలక్ , మాజీ వార్డుమెంబర్ యాసా లక్ష్మి , పసుమర్తి శంకర్‌రావు , యాసా కృష్ణయ్య , పొట్లపల్లి వెంకన్న , వేముల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# మా ఊరుకు బడి వచ్చేనా..!



-అంగన్వాడీ, స్కూల్ లేక అవస్థలు
- ప్రైవేట్ స్కూళ్లకు, హాస్టళ్లకే పరిమితం
-బడికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు నడవాల్సిందే
- భయాందోళనలో తల్లిదండ్రులు



ప్రజాపక్షం/కరకగూడెం: తరతరాలు మారిన తాటిగూడెం గ్రామ పంచాయితీలోని గాంధీనగర్ గ్రామాల్లో మాత్రం మార్పు శూన్యంగా మారింది. దశాబ్దాల చరిత్రను చెప్పుకునే నేటి రోజుల్లో కనీసం విద్యార్థులు, పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి రెండు కిలో మీటర్లు నడవాల్సిన దుస్థితి కనిపిస్తోంది. పాలకుల మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప నీరుపేద జీవితాలలో వెలుగు మాత్రం రావడం లేదు. ఏదో ఒక రోజు తమ జీవితాలలో మార్పు వస్తుందిలే అని దళిత గ్రామాల ప్రజలు కంటున్న కలలు నేటికి కలలుగానే మిగిలిపోతున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని, పాఠశాలలకు విద్యార్థులకు పంపించాలని చెప్పే అధికారులు కనీసం విద్యార్థుల ఇబ్బందులపై దృష్టి పెట్టడంలో విఫలం అవుతున్నారు. ఈవిషయంపై వివరాలు ఇలా ఉన్నాయి. కరకగూడెం మండలంలోని తాటిగూడెం గ్రామ పంచాయితీలో గల విప్పచెట్టు గుంపుకు స్కూల్, అంగన్వాడీ కేంద్రం లేదు. గాంధీనగర్ గ్రామానికి కనీసం రహదారి మార్గం లేదు. సరేలే రోడ్డు లేకపోతే ఏమిటి కష్టపడి పని చేసి బ్రతికే మాకు ఏదో రోజు దేవుడు కరుణించి రహదారిని ఏర్పాటు చేస్తారు అని ఎన్నో ఆశలతో ఆ గ్రామ ప్రజలు జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ గ్రామ ప్రజలకు పిల్లల చదువుకు మాత్రం పడుతున్న ఇబ్బందిని చూసి ప్రతి రోజు భయంతో గడుపుతున్నారు. ఆ ఊరిలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు నిధులు గతంలో మంజూరు అయ్యాయి అయితే సదరు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి మధ్యలోనే పనులను నిలిపి వేసి సంవత్సరాలు గడుస్తున్నా...పట్టించుకునే నాథుడే కరువయ్యారు. విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలు స్కూల్‌కు వెళ్లాలంటే సుమారు రెండు కిలో మీటర్లు నడక మార్గంగా వెళ్ళాలి. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడ విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు రోజు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వారు కూలీ పనులకు వెళ్ళినా కూడా తమ పిల్లలు ఏలా ఉన్నారో నడకమార్గంగా రెండు కిల్లో మీటర్లు నడిచి వెళ్ళాలని దినదినం భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. తమలా తమ పిల్లలు ఉండకూడదని రెక్కాడితే డొక్కాడని తల్లిదండ్రులు వారికి వచ్చిన సంపాదన లో పిల్లలు చదువుకోసం ఖర్చు చేస్తున్నారు. అయితే కనీసం విద్యార్థుల అవస్థలపై రహదారి మార్గం, అంగన్వాడీ కేంద్రం పనులు తిరిగి ప్రారంభించాలని అధికారులను ప్రజాప్రతినిధులను కోరినప్పటికి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల కోసం వచ్చి మాట్లాడే నాయకులు తమ జీవితాలను బాగు చేస్తారు అనుకుంటే తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా మా సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. స్థానిక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు స్పందించి మా జీవితాలలో వెలుగు నింపాలని కోరారు.

**స్కూల్‌కి వెళ్ళాలంటే రెండు కిలో మీటర్లు నడవాలి : గోగు సాయి ప్రకాష్, బిటెక్ విద్యార్థి**

గాంధీనగర్ పిల్లలు స్కూల్‌కి వెళ్ళాలంటే రెండు కిలోమీటర్లు నడవాలని స్థానిక బిటెక్ చదువుతున్న విద్యార్థి గోగు సాయిప్రకాష్ తెలిపారు. పిల్లలు వెళ్లాటానికి సరైన రోడ్డు లేదని, కిలోమీటర్లపైగా మెయిన్ రోడ్డు మీదుగా వెళ్లాలంటే రహదారిపై వాహనాలు తిరుగుతుంటాయని అన్నారు. చిన్న వయస్సులో హాస్టల్‌లో పిల్లలను తల్లిదండ్రులు వేస్తున్నారని, ఇప్పటికైనా మా ఊరికి అంగన్వాడీ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు.

**ఎంఎల్‌ఏ చొరవ తీసుకోవాలి : జాడి సిద్దు, అగ్రికల్చర్ విద్యార్థి**

మా ఊరికి రోడ్లు ఎప్పుడు వస్తాయో ఎప్పుడు మా ఊరి రూపు రేఖలు మారుతాయో అని స్థానిక అగ్రికల్చర్ విద్యార్థి జాడి సిద్దు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత మంది రాజకీయ నాయకులు వచ్చినా కూడా మా రోడ్లు పట్టించుకోవడం లేదని, శంకుస్థాపనలకే పరిమితమైన గాంధీనగర్ రోడ్డు ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు చొరవ తీసుకొని రోడ్లు వేపించాలని కోరారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలి



రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం-నేలకొండపల్లి : రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను అఖండ మెజార్టీ తో గెలిపించాలని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలం లోని చెన్నారం, చెరువుమాధారం లో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. బైరవునిపల్లి లో కాటమయ్య దేవాలయం నిర్మాణం కు శంఖుస్థాపన చేశారు. పైనంపల్లి లో వివాహ వేడుకలను హజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు...కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజులలోనే ఐదు గ్యారంటీలను అమలు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిశాక మరో హామీ ని కూడ అమలు చేస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్, బీజేపీ కి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేసి కాంగ్రెస్ ఎంపీ స్థానాలను భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమ్య, పార్టీ నాయకులు శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, కట్టెకోల సుధాకర్, యడవల్లి హుస్సేన్ గౌడ్, మంకెన వెంకటేశ్వరరావు, మానుకొండ వెంకటేశ్వరరావు, కడియాల నరేష్, వివిధ ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్ లు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ




ప్రజాపక్షం-నేలకొండపల్లి : మండలం లోని ఆరెగూడెం జిల్లా పరిషత్ పాఠశాల కు చెందిన విద్యార్థులకు స్థానిక గ్రామ పెద్ద చిలకల భూషయ్య పరీక్ష మెటిరియల్ ను అందించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమం లో విద్యార్థులకు భూషయ్య చేతుల మీదుగా అందించారు. పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్, స్కేల్స్, కంపాక్స్ పెట్టేలు దాదాపు రూ.12 వేల విలువైన పరీక్ష మెటిరియల్ ను అందించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ దొనకొండ రామకృష్ణ మాట్లాడారు...విద్యార్థుల కు పరీక్ష మెటిరియల్ ను అందించిన భూషయ్య ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి, పాఠశాలకు, గ్రామం కు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వడ్డె యుగంధర్, వడ్డె హనుమంతరావు, చంద్రయ్య, రామారావు, రమేష్, వెంకటనారాయణ, ప్రధానోపాధ్యాయులు చలపతి రావు, సుంతరమోని నాగార్జున, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ మండలంలో పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఎంఈవో సత్తెనపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల, సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ తారీఖు సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్నట్లు తెలిపారు. 286 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ పాఠశాల పరీక్షా కేంద్రంలో 176 మంది విద్యార్థులు, సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో 150 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు వెసులుబాటుగా 9:35 వరకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. సీఎస్ఏ వెంకటేశ్వరరావు, డిపార్ట్మెంట్ అధికారి జి వెంకటేశ్వర్లు, ఇన్విజిలేటర్లు బుర్ర ప్రసాద్, జి రవి తదితరులు ఉన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/గుండాల : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న నిరుపేద కుటుంబాలవారికి ఆసరాగ కళ్యాణ లక్ష్మి పథకంద్వార అందిస్తున్న లక్షానూటపదహారు రూపాయల చెక్కులను శనివారం మండలంలోని తహసీల్దారు కార్యాలయం లో 73మందికి ఎంపిపి ముక్తి సత్యం చేతుల మీదుగ అందచేశారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేద కుటుంబాల వారికి ఈ పథకం ఎంతగానొ ఉపయోగం పడుతుందని అన్నారు. చెక్కుల పంపిణి కార్యక్రమంలో జెడ్పిటిసి రామక్క, ఎంపిటిసిలు కల్తి క్రిష్ణరావు, పరిషిక పద్మ, తహసీల్దారు ఇమానియల్, ఆర్ఐలు నాగేశ్వారవు, జోగయ్య, కార్యదర్శి రామోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా పోషణ పక్వాడ్



ప్రజాపక్షం/మణుగూరు: మండల పరిధి లోని కూనవరం గ్రామపంచాయతీ పరిధి లోని ఎన్టీఆర్ నగర్ గ్రామంలోని అంగన్ వాడి కేంద్రంలో టీచర్ వీసం లీలావతి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు ప్రాజెక్టు అధికారి జయలక్ష్మి , ఐసిడిఎస్ సూపర్వైజర్ సరోజినీ మాట్లాడుతూ ప్రతి గర్భిణీలు, బాలింతలు, పిల్లలు మరియు యువతులు పోషణ విలువలు కలిగిన ఆకు కూరలు, పండ్లు, దుంపలు ఆహారాన్ని ఎక్కువ తీసుకోవడం వల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా శ్రీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం లక్ష్మి కుమారి, అంగన్ వాడి టీచర్లు రాజేశ్వరి, వీరకుమారి, జయలక్ష్మి , నాగమణి, ఆశ వర్కర్ విజయకుమారి, తల్లులు, పిల్లలు గ్రామస్తులు, స్థానిక మాజీ వార్డు మెంబర్లు వంక సూరయ్య, తోలెం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాద వృత్తి ఎంతో గౌరవప్రదమైంది



ప్రజాపక్షం/మణుగూరు: న్యాయవాద వృత్తి ఎంతో గౌరవప్రదమైందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్జ్ వసంత్ పాటిల్ అన్నారు. మణుగూరు ప్రథమ శ్రేణి జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ కు సంబంధించి న్యాయ లైబ్రరీని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం కోర్టు ఆవరణలో జరిగిన మెగా లోక్ అదాలత్‌తో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి కట్టుబడి న్యాయవాదులు తమ వృత్తిలో రాణించాలన్నారు. ఈ వృత్తిలో చట్టాలపై అవగాహన ఎప్పటికప్పుడు మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా న్యాయవాదులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ పోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి తోపాటు తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణలు కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జిల్లా జడ్జితో పాటు బార్ కౌన్సిల్ సభ్యులు మరియు కొత్తగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు రమేష్ కుమార్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, మణుగూరు మెజిస్ట్రేట్ ఎం వెంకటేశ్వర్లు లను మణుగూరు న్యాయవాదులు ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం శ్రీనివాస్, సెక్రటరీ చిర్రా రవి లతోపాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

## పశువుల వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : రైతులు తప్పని సరిగా గాలికుంటు వ్యాధి పై అప్రమతంగా ఉండాలని గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం పర్యవేక్షణాధికారి డాక్టర్. రమణి సూచించారు. మండలం లోని రాజేశ్వరపురం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...రైతులు తప్పని సరిగా టీకాలు వేయించాలని సూచించారు.వ్యాధి వలన పశువుల పాల దిగుబడి తగ్గుతుందని అన్నారు. రైతులు పశువుల పోషణ పై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎంపీపీ వజ్జా రమ్య, మండల పశు వైద్యాధికారి డాక్టర్ సంజయ్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్రమ్మ, రైతులు దండా రంగయ్య, సుభాష్, వజ్జా శ్రీనివాస్, గోపాలమిత్ర లు నరేష్, పాండు, నాగరాజు, తాజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో 'హార్వెస్ట్' కృషి అభినందనీయం




- తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఒత్తిడిలేని బాల్యానికి భరోసా:కరస్పాండెంట్ రవిమారుత్
- అట్టహాసంగా హార్వెస్ట్ స్ప్రింగ్‌లిఫ్ ద్వితీయ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** విద్యార్థులను బావిభరత పౌరులుగా తీర్చిదిద్దుతూ విద్యారంగంలో విజయపథంలో దూసుకుపోతున్న హార్వెస్ట్ కృషి అభినందనీయం అని రాష్ట్ర రెవిన్యూ,గృహనిర్మాణం,సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి పంచాయతీపరిధలోని కరుణగిరిలో గల హార్వెస్ట్ స్ప్రింగ్‌లిఫ్ పాఠశాల ద్వితీయ వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...పెద్దపెద్ద విద్యాసంస్థలన్ని ఖమ్మం నగరంలోనే ఉండటం వలన నగరానికి వెళ్లి విద్యార్థులు విద్యనభ్యసించేందుకు ప్రయాణబారం ఉండేదన్నారు. ఈ క్రమంలో విద్యాభివృద్ధికి,కార్పోరేట్ స్కూల్స్‌తో పాటు నాణ్యతతో కూడిన విద్యను అందించడం కోసం ఇక్కడ ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. నాణ్యమైన విద్య నందించడంలో హార్వెస్ట్ సంస్థలు ఎన్నో సంవత్సరాలుగా దృఢ నిశ్చయంగా ఉన్నాయని, అది రాష్ట్ర నలుమూలలకు తెలుసన్నారు. ఇదే నిబద్ధతను కొనసాగిస్తూ రాబోయేరోజుల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యసంస్థ అభివృద్ధి చెందాలని అభిలషించారు. హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్ మాట్లాడుతూ..ఒత్తిడిలేని విద్యను అందిస్తూ బాల్యానికి భరోసాను అందించడమే తమ విద్యాసంస్థల లక్ష్యం అన్నారు. పాఠశాల విద్యలో అనేక మార్పులు జరుగుతన్నాయని వాటికి అనుగుణంగా తమ సంస్థలు ఉన్నాయన్నారు. రేపటి తరానికి కావలసిన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని,విద్యార్థిని,విద్యార్థులు సమాయత్తం కావాలన్నారు. అంతేకాకుండా అవకాశాలను అన్నింటినీ వినియోగించుకుని శ్రమకి,పరిశోధనకి,సృజనాత్మతకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. అనంతరం అట్టహాసంగా వేడుకలు జరిగాయి. ఇందులో విద్యార్థులు చేసిన కల్చరల్ ప్రోగామ్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, ప్రఖ్యాత కవి,ఫెమా ప్రెసిడెంట్ మువ్వా శ్రీనివాసరావు, హార్వెస్ ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రాజన్, ఉపాధ్యానీ,ఉపాధ్యాయులు ప్రీతీ, చందన, యాకయ్య, అడ్మిన్ సరస్వతి పాల్గొన్నారు.

# నిబంధనలకు అనుగుణంగా వ్యాపారం నిర్వహించాలి

## జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాన్ని నిర్వహిస్తూ రైతులకు అండగా నిలవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఎం. విజయనిర్మల తెలిపారు. ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం రైతు వేదికలో వ్యాపారులకు డిప్లోమ ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టేన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డిఏఈఎస్ఐ) శిక్షణా కార్యక్రమాన్ని ఏడిఏ విజయనిర్మల ప్రారంభించారు. వివిధ మండలాలకు చెందిన 80 మంది వ్యాపారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యాపారులు అవగాహన కల్పిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. చీడ, పీడల నుండి రక్షణ కల్పించేందుకు రసాయనిక ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు వారికి అండగా నిలవాలన్నారు. చట్ట పరిధిలో ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపారం నిర్వహించాలని, డీలర్లంతా శిక్షణా తరగతులకు హాజరు కావాలని తెలిపారు. 48 వారాల పాటు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణా అనంతరం పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ధృవీకరణ పత్రాలు అందజేస్తామని ఆమె తెలిపారు. జిల్లా హార్టికల్చర్ అధికారి రమణ మాట్లాడుతూ కూరగాయలు, పండ్ల తోటల్లో చీడ, పీడల నివారణకు సంబంధించి మందుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక అధికారి వేణుమనోహార్, మత్స్యశాఖాధికారి ఆంజనేయ స్వామి, కెవికె సమన్వయ కర్త రవి, మధిర శాస్త్రవేత్త భరత్, ఏడిఏలు సరిత, శ్రీనివాసరావు, ఆత్మ డిపిడి సతీష్, ఏవో శరత్‌బాబు, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు రూ. 50 లక్షల మంజూరు

## మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ తాగునీటి సమస్య గురించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి ఇటీవల తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. సమస్యను గుర్తించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే రూ. 50 లక్షలను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారని వారు తెలిపారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మండల ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు జగన్, చోటాబాబా, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, దీప్లా నాయక్, దేవ్‌సింగ్, రాము నాయక్, కోటేష్, సతీష్, చిన్న తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రంజాన్ సందర్భంగా ఖమ్మం నియోజకవర్గంలో ఉన్న మసీదులకు లక్ష రూపాయల చొప్పున నిధులు మంజూరు చేసిన తుమ్మల నాగేశ్వరరావుకు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఖమ్మం నియోజక వర్గ ముస్లిం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చోటాబాబా, హుస్సేన్, ముస్తఫా, ఖాదర్‌బాబా, ముక్రం, ఫరీద్‌ఖాద్రి, అబ్దుల్ రెహ్మాన్, సుజా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పసుమర్తి చందర్‌రావు ఆధ్వర్యంలో కల్లూరు లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చేసిన సేవలను కొనియాడుతూ స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఆయన ఆర్యవైశ్యులకే కాక అనేక సామాజిక వర్గాలకు సేవలు చేశారని ఆయన సేవలో మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, వెంకటేష్, గణేష్, గుప్తా, మహిళా విభాగం కోశాధికారి సుజాత లతో పాటు పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



# పరిశ సీతారత్నం ట్రస్టు సేవలు అభినందనీయం : ఎంఇఓ



**ప్రజాపక్షం/ తల్లాడ :** పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని ఎంఇఓ ఎన్.దామోదర్‌ప్రసాద్ అన్నారు. శనివారం అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్రస్టు ఆధ్వర్యంలో ఎంఇఓ, ట్రస్టు చైర్మన్ పరిశ పుల్ల్యయ్యలు పరీక్షా సామాగ్రిని అందచేశారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ పరిశ పుల్లయ్య సతీమణి పరిశ సీతారత్నం పేరిట ట్రస్టు ఏర్పాటు చేసి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.స్వరాజ్యలక్ష్మి , మురళీకృష్ణ, మాదినేని నర్సింహారావు, రాజకుమారి, పులి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని సత్యానారాయణపురంలో గల కస్తూర్భాగాంధీ విద్యాలయంలోని 10వ తరగతి విద్యార్థినిలకు పరీక్ష సామాగ్రిని మానవహక్కుల పరిరక్షన ప్రజాసమితి ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసమితి జిల్లా అధ్యక్షురాలు తోటకూరి అంజమ్మ మాట్లాడారు..పరీక్షలను ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని,ఉపాధ్యాయులు భోధనకు ఫలితాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్‌ఫౌండేషన్ మోటివేషన్ స్పీకర్ పంజాల ఐలయ్య, కస్తూర్భా సిఆర్టిలు పి.శ్రావణి, ఏం సువర్ణ, బి.మణి, మాలతి, రోహిణి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

# కోడ్ కూసింది.. ప్లెక్సీలు తొలిగాయి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించటంతో కోడ్ అమలు లోకి వచ్చింది. నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శనివారం కోడ్ అమలు ప్రకటించిన నేపథ్యంలో వెంటనే అమలులోకి తీసుకొచ్చారు. ప్రధాన సెంటర్ లో ఉన్న ప్లెక్సీలు, పోస్టర్లు, జెండాలు, తోరణాలను పంచాయతీ సిబ్బంది తో దగ్గర ఉండి తీయించారు. ఎన్నికల కోడ్ కూయగానే సిబ్బంది వెంటనే విధుల్లో కి వెళ్లారు. కనిపించిన పోస్టర్లు, ప్లెక్సీలు, తొలిగించి పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా పంచాయతీ కార్యాలయం కు తరలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి దేవేందర్ మాట్లాడారు...ఎన్నికల కోడ్ అమలు లో ఉన్నందున్న మేజర్ పంచాయతీ లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని సూచించారు.

# దేశభవిష్యత్ తరగతి గదిలోనే నిర్ణయించబడుతుంది

-ప్రభుత్వ ఉపాధ్యాయుడు గడల భాస్కర్‌రావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఏదేశ భవిష్యత్ అయినా తరగతి గదిలోనే నిర్ణయించబడుతుందని దేశానికి ప్రధానమంత్రి అయినా , శాస్త్రవేత్త అయిన ఏస్థాయికి ఎదిగిన వ్యక్తి జీవితం తరగతి నుంచి ప్రారంభం అవుతుందని ప్రభుత్వ ఉపాధ్యాయుడు గడల భాస్కర్‌రావు అన్నారు. మండల పరిదిలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల వార్షికోత్సం కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. తెలంగాణా సాయుధపోరాటయోధుడు గడల సీతారామయ్య కుమారుడు గడల భాస్కర్‌రావు మోటివేషన్ క్లాసులను ప్రముఖ మోటివేటర్ ఉభయ తెలుగురాష్ట్రాల్లో వేలాది మంది విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు ఇచ్చిన సుధీర్ చే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గడల భాస్కర్‌రావు మాట్లాడుతు నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని అన్నారు. విద్యార్థులు విద్యార్థిదశనుంచే చదువుమీద శ్రద్ద కలిగి మంచి ప్రవర్తన తో క్రమశిక్షణ కలిగి విద్యనభ్యసించాలని అన్నారు. చదువుతోపాటు సమాజ సేవ చేయడం అలవర్చుకోవాలని పేర్కొన్నారు. బాగా కష్టపడి చదివి జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నిర్వహించిన బుర్రకథ , పిట్టలదొర , కోయడ్యాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. పాఠశాలలోని తెలుగు , ఇంగ్లీషు మీడియం ఉత్తమ మొదటి , రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థిని , విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థిసంఘం విద్యార్థి గేణేశ్వరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లేడిబోయిన గోపాల్‌రావు , తనికెళ్ల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాజకీయంగా దెబ్బతీసేందుకే కవితను అరెస్ట్ చేశారు..

## -మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్
## -వైరాలో బిఆర్ఎస్ నిరసన







**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌కు నిరసనగా వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రింగు రోడ్డు వద్ద నిరసన తెలిపారు. వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. బిజెపి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మాట్లాడుతూ కేంద్రంలో వచ్చే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీని అనగదొక్కేందుకు పార్టీ నేతలపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి కాంగ్రేస్ పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ప్రజలు కెసిఆర్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, జిల్లా దిశా కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జున్‌రావు, ఏన్కూరు జెడ్పిటిసి బదావత్ బుజ్జి, డాక్టర్ కాపా మురళీ, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు షేక్ లాల్‌మహ్మద్, క్రిష్ణ, కౌన్సిలర్‌లు మాదినేని సునీత ప్రసాద్, దారెల్లి పవిత్రకుమారి, వనమా విశ్వేశ్వరరావు, మిట్టపల్లి సత్యంబాబు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, పాముల వెంకటేశ్వరరావు, బోడపోతుల బాబు, మాదినేని ప్రసాద్, కొత్తా వెంకటేశ్వరరావు, లగడపాటి ప్రభాకర్‌రావు, ఆదూరి ప్రేమ్‌కుమార్, దొంతెబోయిన గోపి, దేవరాజు, నందిగామ మనోహర్, చావా రామారావు, గౌస్, మాదినేని లక్ష్మణరావు, పుప్పాల అనంతరామయ్య, వివిధ మండలాల గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

# కోడ్ కూసింది..

## -ఎన్నికల కోడ్‌తో ఫ్లెక్సీలు నేతల విగ్రహాలకు ముసుగులు



**ప్రజాపక్షం/కల్లూరు:** దేశంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగింపు మరియు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేయటం, రాజకీయ నాయకుల పేర్లు గోడలపై రాతలు ఎన్నికల గుర్తులు లాంటివి మండల పరిధిలోని పలు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారులు ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో తొలగిస్తున్నట్లు కార్యదర్శిలు ప్రత్యేక అధికారులు తెలిపారు. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, ముచ్చవరం, కల్లూరు, పేరు వంచ, కప్పల బంధం, బత్తులపల్లి తదితర గ్రామాలలో ఇప్పటికే ఫ్లెక్సీలు తొలగింపు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయటం పూర్తయినట్లు ఆయా గ్రామాల కార్యదర్శులు తెలిపారు.

# అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు పూర్తి




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు నిర్వహణకు బలోపేతం కొరకు ప్రభుత్వం కీలక నిర్ణయం మేరకు గ్రామీణ పట్టణ ప్రాంతాలలో మహిళలను దీంట్లో భాగస్వామ్యం చేయాలని నిర్ణయంతో మండల పరిధిలోని గ్రామాలలో ఉన్న పాఠశాలల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ ఎంపికలు చేసి ప్రధానోపాధ్యాయులు గ్రామ సమైక్య అధ్యక్షులు తోపాటు విద్యార్థుల తల్లులతో కమిటీని నియమించి బ్యాంకు జాయింట్ ఖాతాలు ప్రారంభించడం జరిగిందని ఎంపీడీవో చంద్రశేఖర్, విద్యాశాఖ అధికారి దామోదర ప్రసాద్, ఏపీఎం వెంకట రామారావులు తెలిపారు. అదే విధంగా ఖాతాలలో కూడా పాఠశాలలో నిర్వహణకు నిధులు జమ అవుతున్నట్లు వారు పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు నిర్వహణకు, నిధులు ఏర్పాటుకు, నిర్వహణకు, ఖర్చులకు ప్రభుత్వం నియ మ నిబంధనలకు మేరకు ఈ ఖర్చులు చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు, సిఆర్పిలు, వివోఏలు, గ్రామ సమైక్యలు, మండల సమైక్య ప్రధానో పాధ్యాయులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేటితో ఏడాది పూర్తి చేసుకున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర



**ప్రజాపక్షం/కారేపల్లి:** డిప్యూటీ సిఎం భట్టీవిక్రమార్క పీపుల్స్ మార్చ్ పేరుతో నాటి కాంగ్రేస్ శాసనసభ పక్ష నేత హోదాలో చేపట్టిన పాదయాత్రకు నేటితో ఏడాది పూర్తయింది. గత ఏడాది మార్చి16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పిప్పిరి గ్రామం నుంచి ఈ పాయాత్రను చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రేస్ క్యాలెండర్‌ను కదిలించి అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా చేపట్టిన పాదయాత్ర 109 రోజులపాటు 1364 కిలోమీటర్లు సాగింది. ఈ సందర్భంగా పాదయాత్ర మొదటి రోజు నుండి ముగింపు సభలోని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరిక వరకు జరిగిన విషయాలను గుర్తించుకుంటూ మండల పార్టీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, ఎస్సీ సెల్ మండల నాయకులు మేదరి టోని, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, ఎస్టీ సెల్ నాయకులు గోపాల్‌నాయక్, మైనారిటీ జిల్లా నాయకులు జాని, ఎస్టీ సెల్ నాయకులు భీముడు, సీనియర్ నాయకులు షర్టు వీరభద్రం, చాంద్ పాషా, యువ నాయకుడు తురక అనిల్, అభిమానులు పాల్గొన్నారు.

# వైరా వ్యవసాయ శాఖ ఏడిఏగా బాధ్యతలు చేపట్టిన కరుణశ్రీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులుగా శనివారం టి.కరుణశ్రీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వైరా మండల వ్యవసాయ అధికారి పవన్, వాహిని, సరుప, లక్ష్మీ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

# ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవం



**ప్రజాపక్షం/వైరా:** స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ సభకు విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్న త విద్యను అందించే లక్ష్యంతో వైరా ప్రాంతంలో డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నామని, నైతిక విలువలతో కూడిన ఉన్నత విద్యను అందిస్తున్నామని, గత సంవత్సరం ఐసెట్ ఫలితాల్లో సిద్ధార్థ డిగ్రీ కళాశాలకు చెందిన మంచికంటి ధనుష రాష్ట్రస్థాయి ర్యాంకు(94,98/100) సాధించిందని అదేరకంగా అనేక మంది విద్యార్థులు వివిధ యూనివర్శిటీల్లో మంచి ర్యాంకు సాధించి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. రాబోయే పోటీ పరీక్షల్లో బాగా ప్రిపేర్ అయ్యి ఉన్నత మార్కులు సాధించి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ పివో లింగారావు, మజీద్, వేణు, రాము, చైతన్య, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పథకాలే మహిళలకు, అన్ని వర్గాల పేదల అభివృద్ధికి నిదర్శనం

## -ఎంఎల్ఏ పాయం




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రాష్ట్రంలోని మహిళలకు, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి నిదర్శమని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదిక నందు తహసీల్దార్ ముజాహిద్ధ్ అధ్యక్షతన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మండల వ్యాప్తంగా 33 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకు మేలు జరిగే విధంగా రూప కల్పన చేశారని తెలిపారు. మహిళలు బాగుంటేనే వారి ఇల్లు బాగుంటుందనితద్వారా సమాజం, రాష్ట్రం బాగుంటుందని నమ్మి రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో జమలారెడ్డి, వ్యవసాయ శాఖాధికారి ఆర్ శంకర్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంత్రిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, కైపు శ్రీనివాస్‌రెడ్డి, మంద నాగరాజు, చిప్ప రాజు, దాసరి సాంబ, అశోక్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వివాహా వేడుకలో పాల్గొన్న ఎంఎల్ఏ పాయం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల పరిధిలోని రామానుజగూడెం గ్రామం నందు గొగ్గేల వసంత రావు, సుజాత దంపతుల కుమారుడు నవీన్ చంద్, శృతిల వివాహా వేడుకకు ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్‌సి కవిత అరెస్ట్‌కు నిరసన



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఎంఎల్‌సి కవితను అరెస్ట్‌కు నిరసనగా చంద్రుగొండలో బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రధాన సెంటర్‌లో షాపులను ముగించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జెడ్‌పిటిసి కొణకండ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాల పేరిట రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు లేకుండా చేసి ఏక పార్టీ విధానాన్ని తీసుకురావాలని నరేంద్ర మోడీ చేస్తున్నాడని ఆరోపించారు. ఈడీ సంస్థలతో ప్రాంతీయ పార్టీలపై దాడులు చేయటం ప్రతిపక్షాల గొంతు నొకటమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే బిజెపితో దాడులు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి ధార వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు భూపతి రమేష్, గూగులత్ రమేష్, సత్తి నాగేశ్వరరావు, చాపల మదుగురామరాజు, సయ్యద్ గఫార్మియో, సూరా వెంకటేశ్వరరావు, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఐలయ్యకు నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కాంగ్రేస్ పార్టీ నాయకులు పాలీక లింగయ్య తండ్రి పాలిక ఐలయ్య పెద్దకర్మకి హాజరైన సింగరేణి మండల కాంగ్రేస్ నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, ఎస్సీ సెల్ నాయకులు మేదరి టోని, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, ఎస్టీ సెల్ నాయకులు గోపాల్, సీనియర్ నాయకులు సురేందర్, మనీయార్, భీముడు, జాని, సాట్టు వీరభద్రం, తురక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైన ఈయు మహాసభలు




**-హాజరైన 250 మంది ప్రతినిధులు**
**-కార్మికుల సమస్యలపై సుదీర్ఘ చర్చ**
**-ఆంధ్రప్రదేశ్ నుండి హాజరైన సౌహార్ధ ప్రతినిధులు**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రా రంభమయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుండి వివిధ డిపోలకు ప్రాతినిథ్యం వహిస్తూ 250 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరయ్యారు. ఖమ్మం టిఎన్ జీవోస్ ఫంక్షన్ హాల్‌లో మహాసభల ప్రారంభ సూచికగా ఎంప్లాయిస్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు పద్మాకర్, ఎంప్లాయిస్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. వందలాది మంది కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్ వర్థిల్లాలి, ఏఐటియుసి జిందాబాద్ అనే నినాదాలతో సభ ప్రాంగణం హోరెత్తింది. సుదీర్ఘ కాలం కార్మిక హక్కుల కోసం ఆర్టీసీ మనుగడ కోసం సుదీర్ఘ కాలం పోరాటాలు నిర్వహించి అసువులు బాసిన అమర వీరులకు మహాసభ నివాళులర్పించింది. మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమర వీరుల స్మారక స్తూపానికి పూలమాలలు వేసి ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకులు తిమ్మినేని రామారావు నివాళులర్పించగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, వివిఎస్ బోస్, పోటు ప్రసాద్, పద్మాకర్, ఎస్. బాబు, వెంకట్ గౌడ్, నర్సింహాన్, పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అమరులకు నివాళులర్పించారు. మహాసభ ప్రారంభం కాగానే గత మహాసభ నుండి ఈ మహాసభ వరకు మరణించిన వారికి సంతాప సూచికగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఆహ్వాన సంఘం పక్షాన ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి కె . భాస్కర్ ఆహ్వాన సంఘ స్వాగతోపన్యాసం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ. వెంకన్న అతిథులను, ఆహ్వానితులను, సంఘ బాధ్యులను వేదికపైకి ఆహ్వానించారు. మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మహాసభలలో తెలంగాణలోని ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి విస్తృత స్థాయిలో చర్చించారు. ముఖ్యంగా ప్రభుత్వం 21 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం పై ప్రతినిధులు ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాల్సిందేనని మహాసభ పక్షాన ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న తొమ్మిది డిఏలను తక్షణం విడుదల చేయాలని మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అపాయింట్‌మెంట్ డేట్‌ను ప్రకటించాలని మహాసభలో తీర్మానించారు. పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్యను, సిబ్బందిని పెంచాలని తక్షణం ఆర్టీసీలో అన్ని విభాగాలకు సంబంధించి నియమాకాలు చేపట్టాలని మహాసభ డిమాండ్ చేసింది. మహిళా కార్మికులకు ప్రత్యేక సెలవులతో పాటు సౌకర్యాలు, విధి నిర్వహణలో సౌలభ్యం కల్పించాలని మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. మహాసభ ఆదివారం కూడా జరగనుంది. తెలంగాణ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలకు ఆంధ్రప్రదేశ్ నుంచి సౌహార్ధ సందేశాన్ని ఇచ్చేందుకు అక్కడి సంఘ బాధ్యులు దామోదర్, నర్సయ్య లు హాజరయ్యారు.

# ఖమ్మం మార్కెట్ అభివృద్ధికి కృషి

**కార్మికులకు యూనిఫాం పంపిణీ చేసిన మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై మహిళా కార్మికులు, కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఇటీవల మార్కెట్ అభివృద్ధికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వ్యాపారులు కూడా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. మార్కెట్‌లో క్రయ, విక్రయాలు ప్రశాంతంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మిభాయి, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, నల్లమల వెంకటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్ మల్లేషం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు, డిఎంవో హలీం, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, గ్రేడ్ 2 కార్యదర్శి బజారు, అసిస్టెంట్ కార్యదర్శులు నజీరుద్దీన్, కెవి ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు, కార్పొరేటర్లు, నాయకులు చావా నారాయణరావు, మందడపు మనోహర్, పలువురు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ కోడ్ కూసింది..

**- మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎన్నికల సందడి**
**- ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల**
**- మే 13న ఎన్నిక, జూన్ 4న ఫలితాలు**
**- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్**
**- ఈ సారి త్రిముఖ పోటీ**




**ప్రజాపక్షం/భద్రాచలం :** మళ్లీ ఎన్నికల కోడ్ కూసింది. దేశ వ్యాప్తంగా ఎన్నిక షెడ్యూల్ విడుదల కావడంతో తక్షణమే ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సందడి మొదలైంది.

**లోక్‌సభ ఎన్నికల సందండి ...**

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల కోలాహలం మొదలైంది. 2009లో లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ఏర్పడింది. ఇప్పటికి మూడు సార్లు ఎన్నికలు జరగగా, నాల్గోసారి ఏప్రిల్ 13న ఎన్నికలు జరగబోతున్నాయి. దీని పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మొదటి ఎంపిగా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలారం నాయక్, రెండో ఎంపిగా బిఆర్‌ఎస్ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీరా సీతారామ్ నాయక్, 3వ ఎంపిగా మాలోత్ కవిత (ప్రస్తుతం) ఎంపికయ్యారు.

**మే 13న పోలింగ్...**

మే 13వ తేదిన లోక్‌సభ పరిధిలో పోలింగ్ జరగనుంది. దేశవ్యాప్తంగా ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేస్తూ తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ప్రకటించారు. దీంతో మహబూబాబాద్ లోక్‌సభ స్థానానికి కూడా ఈ ఎన్నికల షెడ్యూల్ వర్తిస్తుంది. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 25వ తేది వరకు నామినేషన్లు తీసుకుంటారు. 26న దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తారు. 29వ తేది వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంది. మే 13న ఎన్నిక జరగనుండగా. జూన్ 4వ తేదిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసి విజేతను ప్రకటిస్తారు.

**త్రిముఖ పోటీ...**

ఈసారి మహబూబాబాద్‌కు జరిగే లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొననుంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేస్తుండగా, గత ఎన్నికల్లో ఓటమి పాలైన బిఆర్‌ఎస్ పార్టీ సైతం తమకు గెలుపు అవకాశాలు ఉన్నట్లు ప్రకటిస్తోంది. ఇక దేశంలో నరేంద్రమోడి నాయకత్వంలో బిజెపి అధికారంలో ఉండటంతో పార్లమెంట్ స్థానంలో మోడి చరిష్మా పనిచేస్తుందని, తద్వారా గెలుపు తథ్యమని ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు. దీంతో కాంగ్రెస్,బిజెపి,బిఆర్‌ఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొననుంది.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**- ఎంపి కవిత, ఎంఎల్‌సి తాతా మధు**
**- సమావేశానికి డుమ్మా కొట్టిన బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల్ డా.తెల్లం**



**ప్రజాపక్షం/చర్ల :** అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మహబూబాబాద్ ఎంపి మాలోత్ కవిత, ఎంఎల్‌సి తాతా మధు అన్నారు. శనివారం చర్ల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఊహించని విధంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ వచ్చిందని, మోసపూర్తి వాగ్దానాలను నమ్మిన ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. 100 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం బండారం బయటపడుతోందని చెప్పారు. రూ.1200 కోట్లరూపాయల రైతుబంధు నిధులను ఎన్నికల సమయంలో పెట్టుబడిపెట్టి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారని ఆరోపించారు. ఖజానాపై భారం పడని పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. బిఆర్‌ఎస్ పార్టీ బలహీన వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వస్తే కరువు పరిస్థితులు ఏర్పడుతాయని కేసిఆర్ చెప్పారని, ఇప్పుడు రాష్ట్రంలో అక్షరాలా అదే జరగబోతోందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్ధిగా డా. తెల్లం వెంకట్రావును గెలిపించారని, అంతకంటే అధిక మెజార్టీతో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపి అభ్యర్ధి కవితను గెలిపించాలని, అందుకు ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, మరో సారి ఎంపిగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేగా కాంతారావు, సోయం రాజారావు, దొడ్డి తాతారావు, రావులపల్లి రాంప్రసాద్, రమేష్ గౌడ్, తాండ్ర రమణ తదితరులు పాల్గొన్నారు.

# కవిత అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నాం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎంఎల్‌సి కవితను ఈడీ అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ బిఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మోరంపూడి అప్పారావు, ఎంపిపి మట్ల నాగమణి, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శనగపాటి సీతారాములు, కొండవీటి రాజారావు, డాక్టర్ కొమరయ్య, బిక్కుమళ్ల సుధాకర్, పుష్పాల చందర్‌రావు, బైటి రాజేష్, వాడే నాగరాజు,జీ కృష్ణ, కర్నాటి రమేష్, బజ్జురి కృష్ణ, నల్లబెల్లి వెంకటేశ్వర్లు, గుడపాటి సురేష్, సూరం పుల్లారావు, పోక్కిలి డేనియల్, రింగు బాలకృష్ణ, కొట్టె శేషు, కమ్మంపాటి శ్రీహరి, యేసుపాక వెంకటేశ్వర్లు, తంబళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్‌సి కవిత అరెస్టుకు నిరసనలు




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కెసిఆర్ కుమార్తె,ఎంఎల్‌సి కవిత అరెస్టును నిరశిస్తూ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసలు జరిగాయి. ఈ సందర్భంగా మోడి సర్కార్ కేసిఆర్ కుటుంబంపై కక్ష సాధింపులు మొదలు పెట్టిందని, ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో ధర్మా చౌక్ వద్ద బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఏ వనమా,కోనేరు సత్యనారాయణతో పాటు బిఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు ఇడి ని అడ్డుపెట్టుకుని మోడి కవితను అరెస్టు చేయించారని, దీనికి తెలంగాణ రాష్ట్ర పెద్దల సహాయ సహకారాలు మెండుగా ఉన్నాయన్నారు. అదే విధంగా భద్రాచలం, పాల్వంచ, చంద్రుగొండ, మణుగూరు తదితర ప్రాంతాల్లో నిరసనలు పెద్ద ఎత్తున జరిగాయి.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

**ప్రజాపక్షం/భద్రాచలం :** అమర జీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమాహాల్ సెంటర్లో ఉన్న ఆయన విగ్రహానికి వాసవీక్లబ్, జిల్లా, పట్టమ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతిని ఏపి, తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో చారుగుళ్ల శ్రీనివాస్, ఉప్పల శారద, తోకల నాగేశ్వరరావు, గుప్తా, అద్దంకి మూర్తి, కురిచేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.